# ★ లోకం విలువలు ★

'లీల'

బీచ్ అంతా నిర్మానుష్యంగా ఉంది. రాత్రి పది గంటలు దాటుతుంది. రావు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రావు ప్రక్కకు చూశాడు. ఒక ఫర్లాంగు దూరంలో ఎవరో స్త్రీవ్యక్తి నీటిలోకి పోతున్నట్లు కనిపించింది. రావు వెంటనే లేచి అటువైపు పరుగెత్తాడు. నీటిలోకి దిగి "ఏమ్ ! అమ్మాయ్ ఏమిటా ఘోరం ? " అంటూ చెయ్యి పట్టుకొని ఒడ్డుకు లాక్కొచ్చాడు.

ఆ అమ్మాయికి పదునెనిమి దేళ్లుంటాయ్ ! ఎర్రగా, బక్కపలచగా యుంది. "నన్నొదలండి ! నేను లోకంలో బ్రతకలేను ? " అంది. రావు మెల్లిగా నీవెవరు ? ఎందుకిలా ఆత్మ హత్యకు ప్రయత్నిస్తున్నావ్ ? " అన్నాడు. "నేను అభాగ్యు రాలిని. నేను నా క్లాసుమెట్ బాబును ప్రేమించాను. ఒక సంవత్సరం రోజులు దొర్లాయి ! బాబు నన్ను తప్పకుండా పెళ్లిచేసు కుంటానన్నాడు. ఇప్పుడు నేను గర్భవతిని. ఈ సంగతి తెలిసి మొన్న బాబు హఠాత్తుగా ఎక్కడికో పారి పోయాడు. "

రావు మెల్లిగా" పిచ్చి పిల్లా! దీనికే ఆత్మ హత్య చేసుకోవాలా ? బాబును నేను వెతుకుతానులే ! అంత వరకూ నా రూములో ఉందుగాని ? "

"ఒద్దండీ ? అసలునాకు బ్రతుకు మీద యిష్టంలేదు"

"అప్పుడే వైరాగ్యమా ? లే ! రూముకు పోదాం ? "

ఆమె ఒక్క నిమిషం ఆలోచించింది. "నేను నడవలేను, ఒక రిక్షాను పిలుచుక రండి " అంది. రావు రిక్షా కోసం వెళ్ళాడు.

రావు ఊరికే అంటాడుకాని తనుమళ్ళీ లోకంలోకి వెళ్ళితే పుట్టగతులుంటాయా ? తనకు బాగా తెలుసు తన భావి జీవితం ఎలాగుంటుందో! తన నిర్ణయానికి అడ్డుఏమి రాకూడదు. మళ్ళీ సముద్రంలోకి దిగింది. అలలు ప్రాణం లేని శరీరాన్ని ఒడ్డుకు త్రోసివేశాయ్ !

*　　　*　　　*

రావు అరగంట సేపు చూశాడు. అర్ధ రాత్రివేళ దగ్గరలో ఎక్కాడా రిక్షా కనిపించలేదు. తుదకు విసిగి వెనక్కు తిరిగాడు.

శవాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఎంతపని చేసింది ఇంతలోనే ఇంత అఘాయిత్యమా ? శరీరాన్ని అటూ యిటూ పొర్లించి చూశాడు. కాని లాభం లేదు.

రావుకు ఇంకో సమస్య ఎదురైంది. హత్య తన మీదకు రాదూ ! పారిపోతే పాపం ! శవాన్ని కాకులు, రాబందులు, తినేస్తాయేమో ? ఎక్కడైనా పూడ్చి వెళ్ళితే?

దగ్గరలో ఒక చిన్న పొద కనబడింది. రావు దానిక్రింద గుంట త్రవ్వడం ప్రారంభిచాండు. ఇసుకనేల కాబట్టి అట్టే కష్టంలేకుండా గొయ్యి తయారైంది.

ఆమె మెళ్ళో పదిపేటలచంద్రహారం, చెవులకు రత్నాల దుద్దులు, చేతులకు 4 జతల బంగారుగాజులు, ఒక వ్రేలికి బంగారు ఉంగరం చూసి రావు ఆశ్చర్య పోయాడు. వాటినన్నిటినీ తీసి పాతేస్తా మనుకొని మెల్లిగా సొమ్ములన్నీ తీసి జేబులోవేసు కొన్నాడు. మెల్లిగా శవాన్ని గోతిలో దింపడం ప్రారంభించాడు. అంతలో హఠాత్తుగా ఒక చెయ్యి వీపుమీద పడింది. రావు గడ గడ వణికి పోయాడు. "నే నేపాపమూ ఎరగనండీ ! ఎవరో ఆత్మ హత్య చేసుకొంది. కావాలంటే శవాన్ని చూడండి" "సరే లే! ముందు స్టేషన్‌కు పద" అన్నాడు ఆవ్యక్తి.

బీచ్ అంతా నిర్మానుష్యంగా యుంది. రావుకు ఏం చెయ్యాలో తోచలేదు. ఇది కేసైతే కొన్ని సంవత్సరాలు నడుస్తుంది. తుదకు తనను ఏదో ఒకటి చెయ్యందే వదలి పెట్టరు. ఇప్పుడు గత్యంతరం ?

తరువాత మెల్లిగా "ఆదిగో ఒక మాట చెబుతావిను ! ఈ అమ్మాయి ఎవరో ఆత్మ హత్య చేసుకొంది. కాని చాలా సొమ్ము చిక్కింది శవంమీద. మనమిద్దరం చెరి సగం తీసుకొందాం. శవాన్ని ఇక్కడే పాతేస్తాం ? నన్ను పట్టుకుపోతే ఏమొస్తుంది నీకు ? రేపుప్రొద్దునే సొమ్ములను అమ్మేస్తాం ?" అని జేబులోని నగలను బైటికి తీశాడు ఆవ్యక్తి నగలను చూశాడు. "నాకు మూడొంతులు కావాలి" అన్నాడు. రావు సరేనన్నాడు.

ఇద్దరూ శవాన్ని పాతేశారు. కొత్తవ్యక్తి నగలు తీసుకొని వెళ్ళిపోయాడు. ఉంగరాన్ని, దుద్దులను మాత్రం రావుకిచ్చి ! మనిషి పోయినా నాకుప్రాణదానం చేసినట్లయింది అనుకొన్నాడు రావు।

'లోకం విలవలు ఇంతే' అని ఘోషించింది బీచ్ !